సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వీధిదీపాల ఏర్పాటు



వీధిదీపాలను దగ్గరుండి వేయిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో మంగళవారం నూతన వీధిదీపాలు వేశారు. పనులను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజావసరాలు తీరుస్తూ వార్డును మోడల్‌వార్డుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు. జీవీఎంసీ నిధులతో అనేక అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. గతంలో 15 వీధిదీపాలు ఉండగా, మరో 70 వీధిదీపాలను ఏర్పాటు చేసి వార్డును వెలుగులతో నింపామన్నారు. విద్యుత్ కోతలకు పరిష్కారంగా నూతన వైర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు

గోపాలపట్నం: జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యాసరచన, క్విజ్ చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని ఏపీ ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ బాబూరావు మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వ్యాసరచన అంశం ప్రకృతితో సామరస్యం, సుస్థిర అభివృద్ధి, చిత్రలేఖనం అంశం ప్రకృతిని, జీవ వైవిధ్యాన్ని రక్షించు, క్విజ్ అంశం ప్రపంచ జీవ వైవిధ్యం, పరిరక్షణ అంశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 8985368180 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

సామాజిక సమస్యలపై బృంద చర్చ



ప్రతిభ చూపిన చిన్నారులతో అతిథులు

మల్కాపురం: సామాజిక సమస్యలైన బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ,మత్తు పదార్థాల వినియోగం,నిర్లక్ష్యరాస్యత, పర్యావరణ కాలుష్యం మొదలైన అంశాలపై చిన్నారులతో బృంద చర్చలు జరిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి ప్రసంగించారు.సమాజంలో జరుగుతున్న పరిణామాలు, ఆ పరిణామాలకు తగ్గ విధంగా చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.పెద్ద వారితో స్నేహం చేయవద్దని.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.అనంతరం చిన్నారులకు విజ్ఞానం పంచే కథలు చెప్పారు. చిత్రలేఖనం,నీతి కథల బోధన వంటి పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులను ఆమె అభినందించి,జ్ఞాపికలు అందించారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరసింగరావు, భవన నిర్మాణ కార్మికులు

డాబాగార్డెన్స్: ఈ నెల 20న పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తామూ భాగస్వాములమేనని భవన నిర్మాణ కార్మికులు తెలిపారు. సమ్మెను పురస్కరించుకుని సిటు నాయకుడు మంగళవారం నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులను రక్షించుకుందామనే నినాదంతో భవన నిర్మాణ కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికులు పార్వతమ్మ, శ్రీను నాయుడు, సింహాచలం, పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఇంధనం స్వాహా!

జీవీఎంసీలో వాహనాల ఇంధనాన్ని స్వాహా చేస్తున్నారు. వాహనాలకు ఇచ్చే ఇంధనాన్ని ధనంగా మార్చుకుంటున్నారని జోన్-8లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలు మరమ్మతులతో ఆగిపోయినా.. నిర్దేశించిన ట్రిప్పులు తిరగకపోయినా మొత్తం చెల్లింపులు చేసి... నీకింత.. నాకింత అన్న చందంగా పంచుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ ఇంధనం దందాపై దృష్టిసారించి చెక్ పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

- గోపాలపట్నం

జోన్-8లో డీజిల్ కుంభం కోణం

టిప్పర్లు, లారీల ట్రిప్పుల్లో గోల్‌మాల్

వాహనం తిరిగిన దాని కన్నా ఎక్కువ చెల్లింపులు

కాంట్రాక్టర్లను పెంచేందుకేనా..



చెత్తను తరలించే జీవీఎంసీ వాహనాలు



జీవీఎంసీ టిప్పర్లు



జేసీబీలు

జీవీఎంసీ జోన్-8లో మొత్తం 32 వాహనాలతో పాటు క్లాప్ వాహనాలు 75 ఉన్నాయి. వీటిన్నటికీ రోజుకు కొన్ని కిలోమీటర్లు తిరగాలని నిర్దేశించి అందుకు తగిన డీజిల్ ఇస్తారు. అయితే వాహనం తక్కువ కిలోమీటర్లు తిరిగినా .. రికార్డుల్లో మాత్రం పూర్తిగా తిరిగినట్లు చూపించి డీజిల్ ఇస్తున్నారని.. అసలు లెక్క తెరవెనుక వేరేలా ఉంటుందని కొంతమంది సిబ్బందే చెప్పుకోవడం కొసమెరుపు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ అధికారులు కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చెత్త తరలించేందుకు 65 కిలోమీటర్లుగా నిర్ణయించారు. అందుకు రోజుకు 42 లీటర్ల డీజిల్ ఇస్తారు. కానీ ఈ వాహనాలు వేపగుంటలో ఉన్న డంపింగ్ యార్డులో డంపింగ్ చేస్తున్నాయి. అలా చేయడం వల్ల రోజుకు సుమారు 15 కిలోమీటర్లు మిగులుతుంది. అంటే నెలకు ఒక్కో వాహనం 450 కిలోమీటర్లు తక్కువ తిరుగుతుంది. దీని ప్రకారం డీజిల్ ఎన్ని లీటర్లు మిగులుతుంది. దీని మాటేమిటి...?. అంతేనా నెలలో కనీసం పది రోజు మరమ్మతులు.. మరో కారణం చూపి వాహనాలను నిలిపి వేస్తారు. అయినా రికార్డుల్లో రోజూ తిరుగుతున్నట్లుగా చూపించి డీజిల్ బిల్లులు చెల్లిస్తున్నారని ప్రధాన ఆరోపణ. ఇలా జోన్-8లో నెలకు సుమారు రూ.5 లక్షల వరకూ వెనకేసుకుంటున్నారని..ఇందులో అధికారులందరికీ తలో కొంత వాటా అందుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జోన్-8లో ఉన్న వాహనాలు

టిప్పర్లు-6, తారాసులు-2, ప్రైవేటు టిప్పర్లు 4, పెద్ద టిప్పర్-1, 20 మోడల్, 70మోడల్, 80 మోడల్ వాహనాలు 3, జేసీబీలు జీవీఎంసీవి-3, ప్రైవేటువి-1, స్వీపింగ్ మిషన్లు చిన్నది -1, పెద్దది-1, బాబ్‌కాట్‌లు రెండు ప్రైవేటువి ఉన్నాయి. టాటా ఏస్‌లు-10 ఉన్నాయి. వీటితో పాటు క్లాప్ వాహనాలు 75 జోన్‌లో చెత్త తరలించే పనులు చేస్తున్నాయి. అయితే ఇవి నిర్దేశించిన రూట్‌లో తిరగాల్సిన కిలోమీటర్లు తిరగకుండా తిరిగినట్లు చూపిస్తున్నారు. ఇదే విధానంలో అన్ని వాహనాలు నడుస్తున్నాయి. జీవీఎంసీ వాహనాల నుంచి కూడా డీజిల్ మిగిల్చుకుని వాటాలు వేసుకుంటున్నారు. అధికారుల వద్ద జీవీఎంసీ వాహనాలు ఎన్ని ఉన్నాయి.. వాటి పని తీరు ఏవిధంగా ఉందన్న విషయాలు కూడా ఉండవు. ఎవరైనా వాటి గురించి అడిగినా ఏఎంహెచ్‌వో... వాహనాల నిర్వహణ చూసే అధికారి వద్ద ఉందంటూ సమాచారమివ్వకుండా తప్పించుకుంటారని పలువురు చెబుతున్నారు. ఈ డీజిల్ బాగోతంపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. ప్రజాధనం అవినీతిపరుల పాలవుతోందని దాన్ని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నాలుగు కొత్త వాహనాలు

జోన్‌లో నాలుగు టిప్పర్లు అదనంగా తీసుకువస్తున్నారు. ఇటీవల రెండు వాహనాలు రాగా మరో రెండు వాహనాలకు మంజూరు పత్రాలు వచ్చాయి. మరి వీటికి పని ఎక్కడ చూపిస్తారో అర్థం కావడంలేదని వాపోతున్నారు.

> **విచారణ చేస్తాం**
>
> వాహనాల వ్యవహారంపై విచారణ జరుపుతాను. వాహనాల రాకపోకలు వ్యవహారం మరో శానటరీ ఇన్‌స్పెక్టర్ చూస్తారు. ఇప్పుడు వాహనాలు నిర్దేశిత కిలోమీటర్లు తిరుగుతున్నాయి. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అవినీతి జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.
>
> – డాక్టర్ బండారు అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్-8

వైభవంగా దుర్గాలమ్మ, బంగారమ్మ జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న శ్రీధర్ దంపతులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరసాలో దుర్గాలమ్మ, బంగారమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి జలాభిషేకం, కుంకుమపూజలు, క్షీరాభిషేకం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంత ప్రజలు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తుల సౌకర్యార్థం మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు.అమ్మవారిని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నగిరెడ్డి వెంకట రమణారెడ్డి , సాడి అప్పారావు , బేరి హరికష్టారెడ్డి , జియ్యాని మారుతి , జియ్యాని విజయ్, వెదుళ్ల శ్రీను, గరికిన వెంకటేష్ రామకృష్ణ ,అధిక సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో కొలువుదీరిన దుర్గమ్మను మంగళవారం ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యం నరకం

- అధ్వానంగా అలూఫ్లోరైడ్ మార్గం
- అవస్థలు పడుతున్న ప్రజలు, ఉద్యోగులు



అలూఫ్లోరైడ్ వెళ్లే మార్గం ఇలా..



ఏరు మాదిరిగా పారుతున్న మురుగు నీరు

మల్కాపురం: గ్రేటర్ పరిధిలో ఆ ప్రాంతం ఉన్నా... వసతులు మాత్రం పల్లెకన్నా ఘోరం. నేటికీ గుంతలతో కూడిన మట్టి రోడ్డు దర్శనమిస్తోంది. దీనికి తోడు అడుగడుగునా గుంతలు ఉన్నాయి. దీనిపై పరిశ్రమల నుంచి వ్యర్థా జలాల చేరడంతో ఆ మార్గంలో ప్రయాణానికి నరకం చూస్తున్నారు.

ఇదీ పరిస్థితి

58వ వార్డు శివారు ప్రాంతమైన ములగాడ విలేజ్ కి ఆనుకుని అటు అలూఫ్లోరైడ్ ఇటు కోరమాండల్ పరిశ్రమలు ఉన్నాయి.అయితే ఈ గ్రామానికి అతి సమీపాన అలూఫ్లోరైడ్‌కు వెళ్లే మార్గం గుంతలతో ఉంది. ఇది ఇలా ఉంటే పరిశ్రమల్లో వ్యర్థజలాలు పోయేందుకు సరైన కాలువ లేకపోవడంతో ఆ నీరంతా రోడ్డుపైకి చేరుతుంది. చిన్నపాటి ఏరులా పారుతోంది. సమస్యను కోరమాండల్ అధికారులకు గ్రామస్తులు వివరించారు. రెండు రోజుల కిందట ఆ సంస్థ నుంచి అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు చెబుతున్నారు. రెండు రోజుల గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గట్టు తవ్వేశారు!



తవ్విన చోటే మట్టితో పూడ్చుతున్న దృశ్యం

- మేహాద్రి గెడ్డ గట్టు వద్ద గ్రావెల్ తరలింపు
- ప్రమాదం పొంచి ఉందని పరివాహక ప్రజల ఆందోళన
- అధికారుల తీరుపై మండిపాటు
- స్థానికుల తిరుగుబాటుతో తిరిగి కప్పేందుకు యత్నం

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డ గట్టు తవ్వేసి గ్రావెల్ తరలిస్తూ దిగువ ప్రాంతాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ వర్క్స్ విభాగం అధికారులు గ్రావెల్ రహదారి పనులు చేపట్టారు. జీవీఎంసీ నిధులు సుమారు రూ. 2.22 కోట్లతో పనులు చేపట్టారు. అయితే మేహాద్రి గెడ్డ గేట్లు ఎత్తే సమయంలో నీరు ప్రవహించే ప్రాంతంలో గట్టు తవ్వేసి ఆ గ్రావెల్‌ను రోడ్డుకు ఇరువైపులా వేసేందుకు వాడారు. దీంతో ఇక్కడ పెద్ద గొయ్యిలా ఏర్పడింది. దీనివల్ల భవిష్యత్తులో గట్టు బలహీనమై తెగే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నాలుగు అడుగుల మేర లోతు తవ్వేశారని వాపోతున్నారు. గ్రామానికి దూరంగా ఉండడం వల్ల లోతుగా తవ్వేసి గ్రావెల్‌ను తరలించుకుపోయారని ఆరోపిస్తున్నారు.

గట్టు తెగితే ప్రమాదమే...

గేట్లు ఎత్తిన సమయంలో అత్యంత వేగంగా నీరు ప్రవహిస్తుందని, దాని కుదుపునకు తట్టుకునే విధంగా రిటర్నింగ్ వాల్ దానికి సపోర్టుగా మట్టితో గట్టు వేసినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఆ గట్టు వద్ద గ్రావెల్ తవ్వడంతో గట్టు తెగితే దిగువ ప్రాంతాలైన వెంకటాపురం, గోపాలపట్నం, కొత్తపాలెం ఎయిర్ పోర్టు పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మేహాద్రి గెడ్డ గట్టు వద్ద గ్రావెల్ కోసం తవ్విన వైనం

కప్పేందుకు సన్నాహాలు...

దీనిపై స్థానికులు అభ్యంతరాలు తెలపడంతో ఈ గొయ్యి కప్పేందుకు ప్రయతాలు సాగిస్తున్నారు. ఇక్కడి పనులు పర్యవేక్షిస్తున్న కొంత మంది వ్యక్తులు మాత్రం కల్వర్టు కట్టామని.. అందుకే గ్రావెల్ తొలగించామని చెబుతున్నారు. చిన్న కల్వర్టుకు ఈ స్థాయిలో గొయ్యి తవ్వుతారా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తుండడంతో తవ్విన గుంతను కప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

> **కల్వర్టు కోసం తవ్వకాలు**
>
> కల్వర్టు నిర్మాణ కోసం గ్రావెల్ తవ్వాం. మేహాద్రి గెడ్డ గట్టుకు ఇబ్బంది కలిగే విధంగా తవ్వలేదు. ప్రజలు దీనిపై ఆందోళన చెందనక్కరలేదు. పనులు పూర్తయిన నేపథ్యంలో తిరిగి పూడ్చుతున్నాం. ఇక్కడ రెండు పనులు చేపట్టాం. మేహాద్రి గెడ్డ పరివాహక ప్రాంతం పర్యవేక్షణకోసం బీటీ రోడ్లు వేస్తున్నాం.
>
> -మోహన్‌కుమార్, ఏఈ

‘కిశోరి వికాసం’తో బాలికలకు భరోసా



గౌరీ నగర్‌లో అవగాహన ర్యాలీ

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి



సూచనలు ఇస్తున్న సూపర్ వైజర్ జ్యోతి

విశాఖ విద్య: 'కిశోరి వికాసం'పథకంతో బాలికలకు భరోసా లభించనుందని ఐసీడీసీ సూపర్ వైజర్ జ్యోతి అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ అంగన్ కేంద్రంలో మంగళవారం యుక్త వయస్సు బాలికల ఆరోగ్యం-పోక్సో చట్టంతో రక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నామె పోక్సో చట్టంపై అవగాహన కల్పించే పోస్టర్ ఆవిష్కరించి, యుక్త యవస్సు బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగు పరచడానికి మంచి అవకాశమన్నారు. 11-18 ఏళ్ల మధ్య బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగు పర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు. విద్యనభ్యసించడమే కాకుండా ఆహ్లాదంగా ఆరోగ్యంగా ఉండేలా తేలికపాటి వ్యాయామం,యోగా చేయాలన్నారు. బాలికలకు పోక్సో చట్టం రక్షణ కవచంగా నిలుస్తుందని.. దీని గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మూర్త, ఆశ వర్కర్, కిశోరి బాలికలు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పదోన్నతులు కల్పించాలని వినతి



పురపాలక శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గణేష్ కుమార్

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీల పదోన్నతుల సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ (ఏపీ ఎస్‌డబ్ల్యుఏఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. మంగళవారం అమరావతిలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ ఆనందరావు ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్‌ను కలిసి వార్డు సెక్రటరీల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. గడిచిన అయిదు సంవత్సరాల వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సేవను జూనియర్ అసిస్టెంట్‌గా పరిగణించి, అప్‌గ్రేడ్ చేయాలని, కొత్త పోస్టు సృష్టించి, సీనియర్ అసిస్టెంట్ పేస్కేలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ శేషుబాబు, వైస్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం.. ఎర్నిమాంబ



ఎర్నిమాంబ అమ్మవారు



ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం-అల్లిపురంలోని అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 17 శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. 18 ఆదివారం వైభవంగా ప్రధాన జాతర, 24 శనివారం భారీ అన్నసమారాధన, 25న మారువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎర్నిమాంబ అమ్మవారి మాలధారుల సంఖ్య ఏడాదికేడాది రెట్టింపు అవుతోంది. అమ్మవారి ప్రాశస్త్యం వర్ధిల్లుతోంది.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్నప్పుడు అప్పటి భక్తులు చిన్న గుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు భయపడేవారు. గత నలభై ఏళ్లుగా ఇక్కడ ఇళ్లు పెరగడంతో రోడ్లు విస్తరించాయి. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. వందేళ్లుగా ఆలయం ఉన్నప్పటికీ గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్లు పూర్వీకులు చెబుతుంటారు. జ్ఞానాపురంతో పాటు అల్లిపురంలోని అచ్చియ్యమ్మపేట గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తారు. ప్రతి ఏటా మే మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తుల కోలాహలం

అమ్మవారిని పూజించే భక్తుల రద్దీ రోజు రోజుకు పెరుగుతోంది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కుడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తున్నారు.ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. అన్నీ శుభాలే జరుగుతాయనే ధృఢ సంకల్పంతో దురాబారాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్థానికులే అమ్మవారి పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసి పలు సేవలందిస్తున్నారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు. అప్పటి నుంచి అమ్మవారికి సేవలందించాలనే ధ్యేయంతో జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన స్థానికులు సేవలందిస్తున్నారు. వంటవార్పులకు ఆయా సంక్షేమ సంఘ సభ్యులు మౌలిక వసతులు కల్పిస్తున్నారు.